# مختصر شرح ألفاظ الأذان )للجمعية(

# అజాన్ పదాల యొక్క సంక్షిప్త వివరణ.

## అజాన్ పదాల యొక్క సంక్షిప్త వివరణ.

వివిధ భాషలలో ఇస్లామీయ సాహిత్య సేవా సంఘం యొక్క శాస్త్రీయ కమిటీ

## అజాన్ పదాల యొక్క వివరణ

వివిధ భాషలలో ఇస్లామీయ సాహిత్య సేవా సంఘం యొక్క శాస్త్రీయ కమిటీ

అజాన్ ఒక దైవిక పిలుపు ముస్లిము దానిని రోజుకు ఐదు సార్లు వింటాడు. అది అల్లాహ్ యొక్క గొప్పతనాన్ని గుర్తు చేస్తుంది మరియు అతన్ని మంచి మరియు సాఫల్యం (ఫలాహ్) వైపు ఆహ్వానిస్తుంది. ఇది మనిషి మరియు తన సృష్టికర్తతో సంబంధం కలిగే క్షణం; ఆ వేళలో అతడు లోకపు కోలాహలంను వీడి, తన ప్రభువుతో సంభాషించడానికి నిలబడతాడు.

అజాన్ లో మహోన్నతమైన అర్థాలు నిక్షిప్తమై యున్నవి; అవి అల్లాహ్ ను మహిమపరచుటతో ప్రారంభమై,ముస్లింలు తమ శాంతిని పొందే నమాజ్ వైపు ఆహ్వానించడంతో ముగుస్తాయి.

అజాన్ పదములు:

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్.(అల్లాహ్ అందరికంటే గొప్పవాడు. అల్లాహ్ అందరికంటే గొప్పవాడు, అల్లాహ్ అందరికంటే గొప్పవాడు, అల్లాహ్ అందరికంటే గొప్పవాడు.)

అల్లాహు అక్బర్ (అల్లాహ్ అందరికంటే గొప్పవాడు)

"అల్లాహ్" అనే పదం "అల్-మా'లూహ్" (అంటే ఆరాధించబడేవాడు) నుండి వచ్చింది. ఈ పదం అత్యున్నతమైన సృష్టికర్త, ప్రభువు యొక్క నామం. అల్లాహ్ యొక్క ఇతర పవిత్ర నామాలన్నీ ఈ ప్రధాన నామాన్ని అనుసరించేవిగా మరియు ఆయన గుణాలను వర్ణించేవిగా ఉంటాయి. అల్లాహ్ ఏకైకుడు, అద్వితీయుడు. ఆయనకు సంతానం లేదు, ఆయన కూడా ఎవరి సంతానం కాదు. ఆయనే ఆకాశాలను మరియు భూమిని సృష్టించినవాడు.

“అల్లాహు అక్బర్” అని పలకడం అంటే: అల్లాహ్ అన్నిటికన్నా మరియు అందరికన్నా గొప్పవాడు; మరియు ఆయన వైభవానికి, పరిపూర్ణతకు తగని ఏ విషయాన్ని ఆయనకు ఆపాదించలేనంత మహోన్నతుడు.

అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు. ఈ వాక్యం ముస్లింకు ఈ జీవితం లో తన సృష్టికర్త నుండి తన దృష్టిని ఏదీ మళ్లించకూడదని గుర్తు చేస్తుంది; మరియు మనిషి తన జీవితాన్ని అల్లాహ్ యొక్క చిత్తానుగుణంగా, ఆయన ధర్మశాసనానుసారం నడిపించవలెనని, తన స్వఇష్టాలనీ వాంఛలననీ అనుసరించి కాదు అని బోధిస్తుంది; ఎందుకంటే అల్లాహ్ ఈ లోకంలోని సమస్తానికన్నా కూడా గొప్పవాడు.

అష్ హదు అన్ లాఇలాహ ఇల్లల్లాహ్, అష్ హదు అన్ లాఇలాహ ఇల్లల్లాహ్

అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడని నేను సాక్షమిస్తున్నాను

ఇదే మొదటి సాక్ష్యం, మరియు దాని అర్థం: అల్లాహ్ సమస్తాన్ని సృష్టించిన సృష్టికర్త, సమస్తానికి ప్రభువు, యజమాని, నిర్వహణకర్త అని అంగీకరించడం; అలాగే ఆరాధించబడవలసినవాడు ఆయన ఒక్కడే అని, ఆయన తప్ప మరెవ్వరు కాదని నిర్ధారించడం; నిజంగా ఆరాధించబడే హక్కు అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ లేదని అంగీకరించడం; అలాగే ఆయన ఏకైకుడు—ఆయనకు భాగస్వామి లేదు, సంతానం లేదు సమానుడు లేడు  ఆరాధనను అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ సమర్పించకూడదు, అలాగే అల్లాహ్‌ను తప్ప మరెవరినీ పిలువకూడదు.

ఈ సాక్ష్యం విశ్వంలోనే అత్యంత గొప్ప సాక్ష్యం. ఇది అన్ని దైవిక సందేశాలలో విశ్వాసానికి మూలం. ఆదం అలైహిస్సలాం నుండి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వరకు వచ్చిన ప్రవక్తలందరూ, నూహ్, ఇబ్రాహీం, మూసా మరియు ఈసా అలైహిముస్సలాం వంటి వారు కూడా, తమ ప్రజలను (అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడు) అనే సత్యాన్ని అంగీకరించమని, స్వీకరించమని మరియు విశ్వసించమని ఆహ్వానించారు. ఇది ఏ మాట కోసమైతే అల్లాహ్ సృష్టిని సృష్టించాడో ఆ మాట. దానిని స్థాపించడానికి ఆయన ప్రవక్తలను పంపాడు, దానిని స్పష్టం చేయడానికి గ్రంథాలను అవతరింపజేశాడు. ఎవరు దీనిని తమ హృదయం నుండి స్వచ్ఛంగా తీసుకువస్తారో వారికి స్వర్గాన్ని ప్రతిఫలంగా ఇచ్చాడు.

ఈ వాక్యం కోసమే ప్రజలు తమ సమాధుల నుండి లేపబడతారు మరియు తీర్పుదినం రోజున విచారించబడతారు. ఎవరైతే దీని

ప్రకారం జీవించి, దానితో తమ జీవితాన్ని ముగిస్తారో, వారు గొప్ప విజయాన్ని సాధిస్తారు. ఎవరు దీనిని తిరస్కరించి, పలకకుండా మరణిస్తారో, వారు నరకంలో శాశ్వతంగా ఉండటానికి అర్హులు.

అష్ హదు అన్న ముహమ్మదర్ర సూలుల్లాహ్, అష్ హదు అన్న ముహమ్మదర్ర సూలుల్లాహ్

ముహమ్మద్ అల్లాహ్ యొక్క సందేశహరుడని నేను సాక్షమిస్తున్నాను

ఈ సాక్ష్యం యొక్క అర్థం ఏమిటంటే, అల్లాహ్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిని దైవ సందేశహరులకు ముగింపుగా పంపారని, మరియు ప్రజలకు వారి ప్రభువు సందేశాన్ని చేరవేశారని ముస్లిం సాక్ష్యం ఇవ్వడం. ఒక ముస్లిం స్పష్టంగా తెలుసుకోవలసినది ఏమిటంటే, అల్లాహ్‌ను ఆరాధించడానికి మరియు ఆయన ఇష్టాన్ని పొందే ఏకైక మార్గం, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు అల్లాహ్ యొక్క సందేశహరుడు అని సాక్ష్యం ఇవ్వడం, ఆయనను అనుసరించడం మరియు ఆయనను ఆదర్శంగా తీసుకోవడం ద్వారానే సాధ్యం. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు అందించిన దైవ నియమావళి ప్రకారం మాత్రమే అల్లాహ్‌ను ఆరాధించాలి.

ఈ సాక్ష్యం, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు, అంతకు ముందు వచ్చిన ఇబ్రాహీం, మూసా మరియు ఈసా (అలైహిముస్సలాం) వంటి ప్రవక్తల వలె, ప్రజలను తిరిగి ఏకత్వం (తౌహీద్) వైపు తీసుకురావడానికి వచ్చారని కూడా కలిగి ఉంది.

ఆయన సర్వలోకాలకు ప్రభువు యొక్క సందేశహరుడు, తన ప్రభువు సందేశాలను తెలియజేయడంలో ప్రవక్తలందరూ నడిచిన మార్గంలోనే నడిచారు. అయితే, ఆయన తర్వాత మరే ప్రవక్త లేడు.

హయ్యా అలస్సలాహ్, హయ్యా అలస్సలాహ్

నమాజు వైపునకు తరలిరండి

వాక్యార్థం: ఓ విశ్వాసులారా, మీ ప్రభువు ఆరాధన వైపునకు వచ్చి చేరండి; నిశ్చయంగా ఆయన మన్నించేవాడు, కరుణామయుడు; ఆయన పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు, పాపములను మన్నించివేస్తాడు.

నిశ్చయంగా ఇది విశ్వాసపరులకు — నమాజులో తమ ప్రభువు సమక్షంలో నిలబడుటకు వారి సమయము వచ్చియున్నదని పిలుపు మరియు గుర్తింపు.

హయ్యా అలల్ఫలాహ్, హయ్యా అలల్ఫలాహ్

సాఫల్యం వైపు తరలి రండి

"అల్-ఫలాహ్" అంటే సంతృప్తి, సాఫల్యం, భద్రత, ఈ లోకంలో మరియు పరలోకంలో విమోచనం.

దాని అర్థాలలో అల్లాహ్ మన్నతతో సాఫల్యం, స్వర్గంలో ప్రవేశం మరియు నరకాగ్ని నుండి ముక్తి ఉన్నాయి; ఎందుకంటే ఎవరు విశ్వసించి నమాజు చేసారో, నిశ్చయంగా అతను సాఫల్యం చెందాడు, మరియు ఎవరు సాఫల్యం చెందాడో అతడు రక్షింపబడి స్వర్గంలో శాశ్వత నిత్య నివాసాన్ని పొందుతాడు.

అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహు

తక్బీర్ మరియు తౌహీద్ (ఏకత్వం) ద్వారా ముగింపు.

అజాను "అల్లాహు అక్బర్" అనే వాక్యం యొక్క పునరావృతంతో మరియు "లా ఇలాహ ఇల్లల్లాహ్" అనే వాక్యం యొక్క నిర్ధారణతో ముగుస్తుంది. ఈ రెండు వాక్యాలు అంతకు ముందు చెప్పిన అర్థాలను ధృవీకరిస్తాయి, మరియు వీటిపైనే మానవ ఉనికి ఆధారపడి ఉంది. ఈ సత్యం కాలం ఎంత దీర్ఘమైనా, సంఘటనలు ఎంత వరుసగా సంభవించినా మారదు, రూపాంతరం చెందదు. అదేంటంటే: అల్లాహ్ ఆయనే అన్నింటికన్న గొప్పవాడు, అల్లాహ్ ఆయనే నిజ ఆరాధ్యదైవం, ఆయన ఒక్కడే ఆరాధనకు అర్హుడు, ఆయన తప్ప ఇతరులను ఆరాధించడం అసత్యం.

సాముగింపుగా: అజాన్ కేవలం నమాజుకు పిలుపు మాత్రమే కాదు; అది ఫలాహ్, విజయం మరియు సఫలతకు పిలుపు. ఇది రోజుకు ఐదు పూటలు మస్జిద్‌లలో మారుమ్రోగే సందేశము, హృదయాలను మేల్కొలుపుటకు; అల్లాహ్ సమీపంలోనే ఉన్నాడని మనకు స్మరింపజేయుటకు.

నీ హృదయాన్ని విశ్వాసానికి తెరువు, మరియు పలుకు: "అష్ హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్, వఅష్హదు అన్న ముహమ్మదర్ర సూలుల్లాహ్", అప్పుడు నీవు అల్లాహ్ కరుణలో ప్రవేశిస్తావు, ఈ లోకంలో నిజమైన సంతోషాన్ని సాధిస్తావు, పరలోకంలో విముక్తిని పొందుతావు, పునరుత్థాన దినాన విశ్వాసుల సమూహంలో లేపబడుతావు.

# విషయసూచిక

అజాన్ పదాల యొక్క సంక్షిప్త వివరణ. ........................................ 2
అజాన్ పదాల యొక్క వివరణ...................................................... 2

te504v1.1 - 06/09/2026